క్లుప్తంగా

అంతర్గత డ్రెయినేజీ పనులు ప్రారంభం



బాలానగర్: బాలానగర్ మండల పరిధిలోని పెద్దాయపల్లి గ్రామంలో సోమవారం అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ పనులు సర్పంచ్ శంకరప్ప ప్రారంభించారు. అంతర్గత వ్యవస్థతో రోగాలు దూరం అవుతాయని, దోమల బెడద తప్పుతుందని, ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన గ్రామం తయారవుతుందని అన్నారు. ఆయన వెంట గ్రామ పెద్దలు జనార్దన్, నరేందర్ రెడ్డి, మహేష్ పర్వతాలు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో ప్రభుత్వ లెక్చరర్లు తమ జూనియర్ కాలేజీలో చేరాలని సోమవారం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేపట్టారు. అడ్డాకులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన లెక్చరర్లు వెంకటేశ్వర్లు, శశికుమార్, గెమ్యానాయక్, నాగచందర్ ఈ సందర్భంగా మాట్లాడారు. తమ కళాశాలలో ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన చేస్తున్నామని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు.

హరినామ సంకీర్తనలో జూలపల్లి భజనబృందం



మహమ్మదాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుమలో నిర్వహిస్తున్న అఖండ హరినామసంకీర్తన కార్యక్రమంలో మండల పరిధిలోని జూపల్లి గ్రామానికి చెందిన భజన బృందం సభ్యులు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో తోక అంజిలయ్య, శివ, కృష్ణయ్య, రామకృష్ణ, శ్రీనివాస్‌లతో పాటు మరో పదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అడ్డాకుల: మండలంలోని కన్మనూర్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రాజవర్ధన్‌రెడ్డి ఇటీవల పొలంలో పని చేస్తూ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. బాధితుడిని సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని తెలిపారు. అంతకు ముందు శాఖాపూర్‌లో మృతి చెందిన బాలకిష్టమ్మ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, నాయకులు భీంరెడ్డి, రాఘవేందర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో పాడిఆవు మృతి

మహమ్మదాబాద్: విద్యుత్‌షాక్‌తో పాడిఆవు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెల్పిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గాధిర్యాల్‌కి చెందిన తలారి గోపాల్ పాడి ఆవులను పెంచుకుని కుటుంబపోషణ కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో ఎప్పటిలాగే సోమవారం మధ్యాహ్నం కూడా ఆవులను మేతకు వదిలాడు. ఓ ఆవు మేత మేసుకుంటూ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు వైర్లు తగలడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. సుమారు రూ.60వేల విలువచేసే పాడిఆవు మృతిచెందడంతో జీవనాధారం కోల్పోయానని తనను ఆదుకోవాలని గోపాల్ కోరారు. విషయం విద్యుత్, వెటర్నరీ అధికారులకు తెలిపినట్లు స్థానిక రైతులు పేర్కొన్నారు.

తెలంగాణ వచ్చాకే అభివృద్ధి

● జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



2కే రన్‌ను ప్రారంభిస్తున్న, జెడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: రాష్ట్రం వచ్చిన తర్వాతే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన 2కే రన్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కాటవరం స్టేజీ నుంచి పోలీస్ స్టేషన్ వరకు 2కే రన్‌ను నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పాలమూరు జిల్లా నుంచి వలసలు ఆగిపోయాయని తెలిపారు. పాలమూరు జిల్లాకే కూలీలు వలసలు వస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. తెలంగాణ వచ్చాక రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పటిష్టమైందన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుతో నేరాలను కట్టడి చేయగలుగుతున్నట్లు వివరించారు. గత పాలకులు చెరువులను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. అనంతరం పోలీసులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణారెడ్డి, సీఐ రజితారెడ్డి, ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు మాధవరెడ్డి, విజయభాస్కర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్ ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు రంగన్నగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో గణనీయమైన ప్రగతి



జడ్చర్లలో తెలంగాణ రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

జడ్చర్ల: ఎన్నో ఏళ్ల ఉద్యమాలు చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గణనీయమైన అభివృద్ధి జరిగిందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జడ్చర్లలో తెలంగాణ రన్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి పాలనలో తెలంగాణ అన్ని విధాలుగా దగా పడిందన్నారు. నూతనంగా ఏర్పాటయిన తరువాత ఊహించని విధంగా అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. పోలీస్ శాఖలో వినూత్నమైన మార్పులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు వ్యాయామం, వాకింగ్ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు 2 కి.మీల రన్‌ను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందుకు అంబేడ్కర్, శ్రీకాంతాచారీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తరువాత బెలున్‌లను ఎగురవేసి ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ సారిక, కమిషనర్ షేక్, ఎంఈఓ మంజులాదేవి, సీఐలు రమేష్‌బాబు, జములప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు పాలాభిషేకం



మంత్రికి పాలాభిషేకం చేస్తున్న స్థానికులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఒకప్పుడు మహబూబ్ నగర్ జిల్లా అంటే ఎంతో వెనుకబడిన ప్రాంతంగా పేరు ఉండేదని... బైపాస్ సమీపంలో ఎకరా పొలం రూ.10 పది లక్షలకు లభించేదని ఇప్పుడు అక్కడ ఎకరా పొలం విలువ రూ.8 కోట్లను దాటిపోయిందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి సహా 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు స్థానిక ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ట్యాంక్ బండ్ ప్రాంతాన్ని రూ. 150 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ప్రస్తుతం ఒకవైపు బైపాస్ ఉండగా త్వరలో కోస్గి బైపాస్ పూర్తవుతుందని తెలిపారు. పార్టీలో చేరికల అనంతర మంత్రికి బీకేరెడ్డికాలనీ ప్రజలు పాలాభిషేకం చేశారు. కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌గౌడ్, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవితో పాటు యువకులు, మహిళలు అభిమానాన్ని చాటుకున్నారు. పూల జల్లు కురిపించారు. అభిమానులు కార్యకర్తలు జై శ్రీనన్న అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ఆనందబాష్పాలు వచ్చాయి..

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ స్థానికులు ఒక్కసారిగా వచ్చి పాలాభిషేకం చేశారని.. ఎంత వారించినా వినలేదని, వారి అభిమానం చూసి ఆనందబాష్పాలు వచ్చాయన్నారు. మంచి చేస్తే ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని నిరూపించారని పేర్కొన్నారు. తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఇక్కడ చదువుకున్న వారికి స్థానికంగానే ఉద్యోగాలు లభించేలా పెద్ద పెద్ద పరిశ్రమలను తీసుకురావడమే ధ్యేయమని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని వార్డు నెంబర్ 16 బోయపల్లికి చెందిన టీడీపీ అధ్యక్షుడు యాదగిరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పెద్ద గొల్ల వెంకటయ్య, కేశవ్ సహా సుమారు 50 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాగర్ కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మారుస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మారుస్తామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సుందరీకరణ పనుల్లో భాగంగా స్థానిక ఆర్అండ్‌బీ సర్కిల్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన టీ–కప్, వృక్షో రక్షితః కాన్సెప్ట్, ఫిరంగిలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నిర్మించే ప్రతి ఇంటి యజమాని తప్పకుండా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహబూబ్‌నగర్‌ను అద్భుతమైన పర్యాటక కేంద్రంగా మలుస్తామన్నారు. అంతకుముందు వార్డు నం. 21లోని బీకేరెడ్డికాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పట్టణంలో నెలకొన్న సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. రోడ్లు, డ్రైయినేజీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, రామలక్ష్మణ్, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, డీఈఈ బెంజిమన్ పాల్గొన్నారు.

లబ్ధిదారులు కేసీఆర్‌కు అండగా ఉండాలి

అడ్డాకుల: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు తప్పకుండా సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామంలో సోమవారం నియోజకవర్గానికి సంబంధించిన రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు గొర్రెలను అందజేసి కాపరులనుద్దేశించి ఆయన మాట్లాడారు. గొల్ల, కురుమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. యాదవుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. నియోజకవర్గంలో మొదటి విడత కింద రూ.71కోట్ల వ్యయంతో 5708 మంది లబ్ధిదారులకు, రెండో విడతలో రూ.101కోట్ల వ్యయంతో 5767 మందికి గొర్రెలను పంపిణీకి చర్యలు చేయనున్నట్లు తెలిపారు. గొర్రెలను పొందిన కాపరులు వాటితో వృద్ధిలోకి రావాలని కోరారు. అంతకు ముందు అడ్డాకులలో పర్యటించి క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రూ.50శాతం సబ్సిడీతో నాగవర్ధన్, ఖాసిమ్‌లకు స్విఫ్ట్ కార్లను అందజేశారు. నగర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌గౌడ్, సీఐ రజితారెడ్డి, ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ్మాయాదవ్, సర్పంచ్ శైలజారెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, డాక్టర్ మధుసూదన్, ఎంపీటీసీ పల్లవి, కోఆప్షన్లు జమీర్, ఖాజాషోరీ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించగా జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు మాస్టర్ రవి సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి పది మంది విద్యార్థులు పాల్గొనగా ఎం.యోగేష్ 42కేజీ జూనియర్ విభాగంలో బంగారు పతకం, 34కేజీల క్యాడెట్ విభాగంలో కావ్యశ్రీ బంగారు పతకం, 25కేజీ సబ్ జూనియర్ విభాగంలో సాయికుమార్ కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్, మాస్టర్ రవి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

14 నుంచి పద్య నాటక ప్రదర్శనలు

స్టేషన్ మహబూబ్‌నగర్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 14, 15 తేదీల్లో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో పద్యనాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు శ్రీమిత్ర కళానాట్య మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జానపద ప్రదర్శనలు, బృంద నృత్యాలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, శ్రీకృష్ణరాయబార నాటకం, అల్లూరి సీతారామరాజు, 15న జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభిస్తారని విజయవంతం చేయాలని కోరారు.

మోగిన బడి గంట

నవాబుపేట: విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో సోమవారం పాఠశాలలన్ని తెరుచుకున్నాయి. మొదటి రోజు విద్యార్థులు చాలా తక్కువ సంఖ్యలో పాఠశాలలకు వచ్చారు. దయపంతులపల్లి, మొగుళ్లపల్లి, కొత్తపల్లి, చాకలపల్లితండాల్లో హాజరైన విద్యార్థుల సంఖ్య పదికి లోపే పరిమితమైంది. కిష్టపల్లి తండాలో ఉపాధ్యాయుడు లేకపోవటంతో సమీపంలోని తండా ఉపాధ్యాయునితో ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్‌ను వివరణ కోరగా మొదటి రోజు కావటంతో హాజరు తక్కువగా ఉందని, బడిబాట ద్వారా విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చేస్తామన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని కోరారు.

వెంచర్ అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జడ్చర్ల: మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఏర్పాటు చేసిన ఓ వెంచర్ నిర్వాహకులు పలు అక్రమాలకు పాల్పడ్డారని, సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ రవినాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు సామాజిక పర్యావరణ కార్యకర్త వెంకటయ్య తెలిపారు. వెంచర్ నిర్మాణంలో భాగంగా చుట్టుముట్టు ఉన్న చెరువులు, కుంటలను ధ్వంసం చేయడంతో పాటు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి భూగర్భంలో నిర్మించిన సొరంగంపై వెంచర్‌ను ఏర్పాటు చేశారని ఆరోపించారు. దీంతో భవిష్యత్తులో టన్నెల్‌కు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఖాజామైనోద్దీన్ దంపతులు హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా సోమవారం రాత్రి గ్రామస్తులు సన్మానించారు. జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ రంగన్నగౌడ్, కోఆప్షన్ ఖాజాషోరీ తదితరులు మైనోద్దీన్‌ను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో రమేష్, జహంగీర్, శేఖర్‌సాగర్, రాజునాయక్, లతీఫ్, మురళీ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన దరఖాస్తుదారులు

జడ్చర్ల టౌన్: బీసీ కులవృత్తి దారులకు రూ. 1లక్ష సాయం అందిస్తామని సీఎం ప్రకటించటంతో సోమవారం మండల కార్యాలయానికి దరఖాస్తు దారులు పోటెత్తారు. దీంతో కార్యాలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. సాధారణంగా నిత్యం కుల, ఆదాయం, తదితర ధ్రువీకరణ పత్రాల కోసం 50 నుంచి 60 దరఖాస్తులు వచ్చేవని, ఈరోజు 500లకుపైగా వచ్చాయని అధికారులు తెలియజేశారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

చిన్న చింతకుంట: ముచ్చింతలలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. అంతకుముందు ఆయనకు గ్రామస్తులు స్వాగతం పలికి సన్మానించారు. ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, సర్పంచ్ హరిత పాల్గొన్నారు.

కంటెయినర్ డయాలసిస్ ప్రారంభం

జడ్చర్ల టౌన్: డయాలసిస్ జరుగుతున్న తీరులో విప్లవాత్మక మార్పులు చేస్తూ జడ్చర్ల వంశీ ఆస్పత్రిలో నెఫ్రోప్లస్ మొట్టమొదటి కంటెయినర్ డయాలసిస్‌ను ఆ సంస్థ వ్యవస్థాపకుడు విక్రమ్ వుప్పాల సోమవారం ప్రారంభించారు. మూత్రపిండ సంరక్షణకు మార్గదర్శకునిగా నెఫ్రోప్లస్‌ను వినూత్న పరిష్కారాల ద్వారా రోగుల సంరక్షణను అభివృద్ధి చేయటానికి అంకితం చేస్తున్నామన్నారు. అందుబాటు ధరల్లో, అధిక నాణ్యతతో సేవలను అందించటం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మరో 10 యూనిట్లను స్థాపించాలని ప్రణాళిక చేస్తున్నామన్నారు. కంటెయినర్ డయాలసిస్ ఒక నిర్దిష్ట వ్యవధిలో నలుగురికి సేవలు అందించగలుగుతుందన్నారు. సహ వ్యవస్థాపకుడు కమల్‌షా పాల్గొన్నారు.

గౌరమ్మకు బంగారు నెక్లెస్



అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని గౌరమ్మకు మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాయన్నగౌడ్, మంజులాదేవి దంపతులు 10 గ్రాముల బంగారు నెక్లెస్‌ను బహూకరించారు. తమ కుమార్తె సింధూజ ఎంబీబీఎస్ పూర్తి చేసిన సందర్భాన్ని పురస్కరించుకున్న సందర్భంగా నెక్లెస్ చేయించి ఆలయ నిర్వాహకులకు అందజేశామన్నారు. ఈ మేరకు వారిని ఆలయ నిర్వాహకులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈఓ రాజేశ్వరశర్మ, అర్చకులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ వైద్యుడిగా శివకాంత్



జడ్చర్ల టౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించిన వారిలో నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ వైద్యుడిగా డా. శివకాంత్ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి కృష్ణ ఉత్తమ సేవలు అందించిన వారి జాబితాను సోమవారం విడుదల చేశారు. నియోజకవర్గంలో 6 మండలాలు ఉండగా ఉత్తమ వైద్యుడిగా గంగాపూర్ వైద్యాధికారి డా. శివకాంత్, ఉత్తమ స్టాఫ్ నర్స్‌గా కె. ప్రశాంతి (నవాబుపేట పీహెచ్‌సీ), ఉత్తమ ఫార్మసిస్ట్‌గా బాలు (మిడ్జిల్ పీహెచ్‌సీ), ఉత్తమ ల్యాబ్‌టెక్నీషియన్‌గా వినోద్ (నవాబుపేట పీహెచ్‌సీ), ఉత్తమ ఏఎన్ఎంగా కె.శ్రీదేవి (గంగాపూర్ పీహెచ్‌సీ, ఆలూరు సబ్‌సెంటర్), ఉత్తమ ఆశ కార్యకర్తగా ఇందిరా(గంగాపూర్ పీహెచ్‌సీ)లు ఉన్నారు. వీరికి బుధవారం నిర్వహించనున్న వైద్య ఆరోగ్యశాఖ ప్రగతి సభలో స్థానిక ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి అవార్డులు అందించనున్నారు.